729

# ఇది నిజం

డైనింగ్ టేబిల్‌మీద భోజనసామగ్రి అందంగా అమర్చింది అపర్ణ. "మీరు రావచ్చు!" అంది మెల్లగా గెస్టురూంకేసి చూస్తూ.

"అదో సిగ్నల్ వచ్చిందోయ్ మధూ? పద!" నవ్వుతూ స్నేహితుడి వేపు చూశాడు గోపీకృష్ణ.

ఇద్దరూ డైనింగ్‌టేబిల్ దగ్గరకు వచ్చారు. అపర్ణ అక్కడలేదు.

"అపర్ణా! ఇక మేం స్వంతవడ్డన ప్రారంభించాలా!" విసుగ్గా వంటగదివేపు చూచాడు గోపీకృష్ణ

"మరి నన్ను రమ్మంటారా?" మృదువుగా వినవచ్చిం దామాట.

"అదీ చెప్పాలా?" అన్నాడు చిరాకుగా. వెంటనే మధువేపు తిరిగి, "మా అపర్ణ ఘోషాతో చచ్చిపోతున్నారా బాబూ! కొత్త వాళ్లు వచ్చారూ అంటే ఇక వంటింట్లోనుంచి బయటకు రాదోయ్! చచ్చే చావయ్యింది!" అన్నాడు. ఆ మాటలలో సగం కోపం, సగం చిరాకు నిండివుంది.

గబుక్కున అపర్ణ బయటకు వచ్చింది. "మీరు కలుపుకోండి, నేను వడ్డిస్తాను!" అంది. క్షణకాలం మధు అనిమిషునిలా అయిపోయాడు. ఎక్కువ పొట్టీ, పొడవూ కాని సమ ఎత్తులో బొద్దుగా, తెల్లగావుంది. ముచ్చటగా చుట్టుకున్న జుట్టుముడి, చెవులకు ఎర్రరాళ్ళ దుద్దులు, మెడలో మూడుపేటల బంగారు గొలుసూ, నల్లపూసలూ, నుదుటిమీద ఎర్రని నిలువు బొట్టూతో వున్న అపర్ణ, కళ్ళు చెదరగొట్టే సౌందర్యవతేం కాదు.... కానీ ఏదో ఆకర్షణ దాగివుం దావిడలో!

"మీరు కలుపుకోండి, నెయ్యి వేస్తాను." భర్తకు నెయ్యి వడ్డించాక, మధు చూపు తనని ఆపాదమస్తకం పరికిస్తుండటం గమనించి, హెచ్చరించింది.

మధు క్షణకాలం లోలోపల సిగ్గుతో గిలగిలలాడిపోయాడు.

"గోపీ ఏమనుకునివుంటాడు? ఆమె ఏమనుకొనివుంటుంది. లోలోపల మధనపడిపోయాడు. భోజనం చేస్తున్నంతసేపూ అపర్ణను అణువణువూ పరిశీలిస్తున్నా యతగాడి చూపులు. "ఏదో ఆకర్షణవుం దీవిడలో .... అదేమిటి?" అదే ఆలోచన. కూరలో సాంబారు కలిపేసుకున్నాడు. రసంలో వూరిన మిరపకాయ నంజుకున్నాడు. పెరుగులో ఊరగాయకు బదులు ఉప్పు నంజుకున్నాడు!

"నిన్ను చూసి షాక్ తిన్నట్లున్నాడు మా ఫ్రెండ్!" ఆరాత్రి పడుకోబోతూ అపర్ణతో అన్నాడు గోపీకృష్ణ.

"అవును!" మెల్లిగా అంది అపర్ణ తనదోమతెర సరిజేసుకుంటూ.

"అవును...." వెక్కిరించాడు గోపీకృష్ణ. "అలా అనటానికి సిగ్గువెయ్యటంలేదూ?"

"సిగ్గా? ఎందుకూ?"

"ఒక్కసారి మధు భార్య పద్మజను చూడాలి నువ్వు. అప్పుడర్థమౌతుంది ఏందుకో!"

"ఆవిడ చాలా అందంగా వుంటుందా?" కుతూహలంగా అంది అపర్ణ.

"ఊహూఁ! పెద్ద అందమని చెప్పలేను.... కానీ ఏదో ఆకర్షణ వుందామెలో. నీలా నల్లలూ, మట్టెలూ వేసుకోదు. రెండు జడలు వేసుకుంటుంది. డైనింగ్ టేబిల్‌దగ్గర అతిథుల ఎదురుగా కూర్చుని అడిగి

అడిగి మరీ తినిపిస్తుంది. గంటలకొద్దీ కబుర్లు చెబుతుంది. అందుకే అక్కడికి వెళితే – మధువాళ్ళింట్లో వారం రోజులున్నా నాకు విసుగనిపించదు.... "

వింటున్న అపర్ణ ఫక్కున నవ్వింది.

"ఎందుకూ నవ్వు ?" రోషంగా అరిచాడు గోపీకృష్ణ.

"నవ్వక ఏంచెయ్యను ? ఆవిడలా నేనుండలేదని మీకు కోపం అవునా ? నా తత్వం ఇది.... ఆవిడ తత్వం అది.... అన్నట్లు ... మీ ఫ్రెండ్ కిష్టమైన టిఫినేమిటో చెప్పండి. రేపు చేస్తాను...."

"ఆహా ! రాత్రి భోజనం అంచక్కా వడ్డించావు....వాడు సరిగా తిననేలేదు ! ఇక టిఫిన్ పెడతావు ! అందులో రేపంతా నాకు ఆఫీస్‌వర్క్ చాలావుంది ! రోజంతా ఆఫీసులోనే గడిపెయ్యాలో ఏమిటో ? కంపెనీ లేక గిలగిలలాడుతాడో ఏమో మధు...."

"సర్లెండి ! నాకు నిద్రవస్తోంది...." అపర్ణ దుప్పటి బిగించేసింది.

*  *  *

మధుకు దిక్కుతోచడంలే దీరోజు. హాయిగా మధ్యాహ్నం వూరి కెళ్ళిపోయినా బావుండేదేమో ? కానీ గోపీ కదలనిస్తేనా తనని ?

ఆవిడగారు.... ఆ అపర్ణాదేవిగారేమో ఘోషాస్త్రీ కంటే అన్యాయం. ఇంటి కొచ్చిన అతిథి కింత తిండి, పడుకోవటానికో గది ఏర్పాటు చెయ్యటంతో తీరిపోయిందని కాబో లావిడ ఉద్దేశ్యం. చదువుకున్న స్త్రీ కదా ? తనతో కబుర్లు చెప్పకూడదూ ? అతిధి వున్నాడా, చచ్చాడా ? అన్న ఆలోచనలేని మహానుభావురాలు....

"మీరు వచ్చి టిఫిన్ పుచ్చుకోండి !" గది బయటనుంచి వినిపించిన అపర్ణ మృదువైన పిలుపుతో ఉలిక్కిపడ్డాడు మధు.

"ఆ....! ఆ....!" అన్నాడు కంగారుగా లేస్తూ! ఆవిడ టేబిల్ మీద టిఫిన్, మంచినీళ్లు పెట్టి వెనుదిరిగి వెళ్తోంది. వెళ్తున్న ఆమెకేసే చూస్తూ కూర్చుండి పోయాడు మధు....అందం....వుహూ! అందంకంటే ఎక్కువైన ఆకర్షణ....ఏమిటిది? తనలో ఏదో మనోవికారం....ఛ.... ఛ. . .తప్పు. . .తప్పు. . .పొలమారింది.

"మెల్లిగా. . .మెల్లిగా సర్దుకోండి. మంచినీళ్లు తాగండి. . .పైకి చూడండి. పకోడీలలో కారం ఎక్కువయిందల్లే వుంది. . .మీకు కారం ఎక్కువగా వుండాలని చెప్పారు వారు. . .పోనీ కాస్త స్వీట్ నోట్లో వేసుకోండి!" అపర్ణ టేబిల్ మీదకు వంగి, ఆదుర్దాగా క్షమాపణ చెప్పుకుంటున్నట్లు అంటోంది. . .గాభరాగా చూస్తోంది. . .

"ఫర్వాలేదు. . .కొద్దిగా పొలమారింది అంతే!" నవ్వేశాడు మధు.

"హమ్మయ్య!" హాయిగా నిట్టూర్చింది. "టీ పుచ్చుకోండి!" ఆ నల్లని పెద్ద కళ్ళలో భయం తొలగి సంతోషచ్ఛాయలు ప్రతి ఫలించాయి. . .మెల్లిగా లోపలికి వెళ్ళిపోయింది.

విచిత్రమైనభావం.... కాదు భూతం . . . తలెత్తుతోంది తనలో . . . ఛీ . . . తప్పు ఆమె గృహిణి. . . తనస్నేహితునిభార్య, తనూ ఓ వివాహితుడు. . .పద్మజకు భర్త. . .ఏమిటీ వెర్రి ఆవేశం?

గదిలోకి వెళ్ళి కిటికీ దగ్గర నిల్చున్నాడు. పెరట్లో అపర్ణ సన్నజాజులు కోసుకొంటోంది. జుట్టుముడివీడి, పొట్టి జడ వీపుపైన కదలాడుతోంది. అప్రయత్నంగా ఆమె తిరిగిచూచింది. క్షణకాలం ఇరువురి కళ్లూ కలుసుకున్నాయి. జాజులు కోయటం అయిందో, కాలేదో మరి, మరుక్షణం ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

"ఏమోయ్ భగవాన్లూ! మా శ్రీమతి చేతిపెట్టు. . .ఎప్పుడెప్పుడా ప్రయాణం అనిపిస్తోందా?" నవ్వుతూ భుజంమీద చేయివేసి అడుగు తున్న గోపీకృష్ణను చూచి, తబ్బిబ్బుపడిపోయాడు మధు క్షణకాలం.

గోపీ గమనించలేదు కదా? ఆవిడ తనగురించి గోపీతో "చెడుగా" చెప్పదు కదా?

"ఏమిటా పిచ్చిచూపు?" గోపీకృష్ణ నవ్వుతూ, కుదిపేశాడు.

"అబ్బెబ్బే అదేం లేదు. . ." నాన్చాడు.

"అలా అనక మరేమంటావ్ లే. . . మధూ! ఓ చిన్న సాయం చేస్తావూ?"

"ఏమిటి?" విచిత్రంగా చూచాడు.

"మా అపర్ణను గురించి. . .ఇందాకా నీఫీలింగ్స్ ఎలా వున్నాయో నిర్మొహమాటంగా చెప్పరా . . . అలా ఎవరూ చెప్పే అతిథులు లేక, రాకనే అపర్ణ ఇలా నా ప్రాణం తోడేస్తోంది . . . నువ్వేనా చెప్పెయ్ ఆవిడతో . . . అపర్ణా! ఇలారా!" గోపీకృష్ణ మాటలు మధులో మరో రకమైన భావ సంచలనాన్ని రేపాయి.

"ఎందుకు పిలిచారూ? అపర్ణ గది గుమ్మంవరకూ వచ్చి ప్రశ్నించింది. తలుపు వారగా వున్న అమె మధుకు కనిపిస్తోంది. జుట్టు, చుట్టగా అమర్చుకుంది. జాజులు పెట్టుకుంది. ఏదో కళ – ఏదో సౌందర్యం. తను తట్టుకోలేక పోతున్నాడు.

"మధు, నీ గురించి . . . అతగాడు ఫీలైన నిజమైన ఉద్దేశ్యాలేమిటో చెప్పేస్తాడు. వింటావా?"

"తప్పకుండా!" మృదువుగా నవ్విందామె.

అబ్బెబ్బే... అదేం లేదండీ..." మధు తప్పుకోబోయాడు.

"ఫర్వాలేదు, నీ మూలాన్నయినా అపర్ణలో మార్పువస్తే అంతే చాలు నాకు"...గోపీకృష్ణ బాత్‌రూం వేపు వెళ్ళిపోయాడు. అపర్ణ వెళ్ళిపోయింది.

మధులోని మరో వ్యక్తి విజృంభించాడు. ఎంత చక్కటి అవకాశం ఇచ్చాడు గోపీకృష్ణ? ఆమెను గురించిన తన నిజమైన ఆలోచన ఆమెకు చెప్పగలిగితే? విని ఆవిడేమంటుంది? గోపీకి చెబితే? ఓహ్! చెబితే ఏం? గోపీ తన నే విషయంలోనూ మందలించడు. కారణం, తా మిద్దరి మధ్యావున్న స్నేహబంధంలో అంతటి చనువుంది.

మరునాడు గోపీకృష్ణ ఆఫీసుకు వెళ్ళిపోయాడు. సాయంత్రం నాలుగుగంటలకు తనకు ట్రైన్‌వుంది! అప్పటికి తనను సాగనంపటానికి వస్తానన్నాడు గోపీ. ఈలోగా...ఈలోగా అపర్ణతో ఒక్కసారి మాట్లాడ గలిగితే?

"టిఫిన్ చల్లారిపోతోంది...మీరు రావచ్చు..."అపర్ణ తియ్యని పిలుపు.

"వస్తాను...మీతో ఓ చిన్న సంగతి మాట్లాడాలి...మీ కభ్యంతరం లేకపోతే..." తడారిపోతున్న పెదవులను నాలుకతో తడిచేసుకున్నాడు.

"చెప్పండి..." మృదువుగా అంది.

"మీరిలా వచ్చి, కాస్సేపు కూర్చోగలరా?"

"ఆ!" గదిలోనికి వచ్చి, తనకొక్కాస్త దూరంలో వున్న గార్డెన్ ఛేర్‌లో కూర్చుంది.

"మీ గురించి నిజమైన నా అభిప్రాయాలు చెప్పమన్నాడు మా గోపి ; మీకు గుర్తుందను కుంటాను."

"చెప్పండి..." స్థిరంగా చూస్తూ అంది.

"అతి సాధారణంగా కనిపించే మీలో అసాధారణమైన ఆకర్షణేదో నిండివుంది. . .అది నన్ను నిలువునా. . .ఏదో. . .చేసేసింది !" మాటలు తడబడుతున్నాయి.

క్షణకాలం అపర్ణ అతగాడి కళ్ళలోకి చూచింది. ఆమెచూపు ఎర్రగా కణకణ లాడుతున్నట్లుంది.

"ప్లీజ్ ! మీరు అలాకోపంగా చూడకండి. . .మీరీవిషయం గోపీకి చెప్పినా ఫర్వాలేదు. . .నన్ను నేను నిగ్రహించుకోలేక చెబుతున్నాను. . అతిథిగానేకాదు, మిమ్మల్ని చూచాక ఓ మగవాడిగా నే నేది ఫీలయ్యానో అదే చెబుతున్నాను. . . అపర్ణా ! ఐ లవ్ యూ !" ఏదో మైకం. . . మరేదో బాధ అతగాడి కళ్ళలో గూడుకట్టుకునివుంది.

అపర్ణ అతగాడి వేపు అలాగే చూస్తోంది.

"ఇది తప్పో, ఒప్పో నాకు తెలియదు. . .అసలా సంగతి ఆలోచించలేనుకూడా. . .ఇదే నా అభిప్రాయం. . . ఐ లవ్ యూ !"

"మంచిది !" అపర్ణ కంఠస్వరం మృదువుగా పలికింది. "మీ నిజాయితీని మెచ్చుకుంటున్నాను. . .మీ వుద్దేశ్యాలు అలా వున్నప్పుడు, మీ రలా ఫీలై నారు. అందుకు ఎవరి అభ్యంతరం మాత్రం ఏముంది ? అందు క్కారణమూ నాకు తెలుసు !"

విస్మయంగా చూశాడు మధు ఆమె వేపు .... ఆమె తనని మందలించలేదు.... తిట్టలేదు.... గోల... చెయ్యలేదు కానీ ఏదో మంత్రం వేస్తోంది.... " ఏమిటా కారణం " కుతూహలంగా అడిగాడు.

"మీరు సగటు పురుషులు! మా వారికి మీ పద్మజ చాలా నచ్చిందట! మీరు నన్ను...." ఐ లవ్ యూ" అనేశారు! సాధారణంగా మగవారికి తన భార్యకంటే ఎదుటివాని భార్య నచ్చుతుంది. ఇది నిజం! ఇందులో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు.... మరి నే వెళ్ళాలిక. మీ టిఫిన్ చల్లారిపోతోంది ... ఇంకాస్సేపట్లో వారు వస్తారు ... వారికి టిఫిన్ అమర్చాలి. . . నేవెళతాను!"

ట్రైన్‌లో కూర్చున్నాక కూడా మధు ఆ "షాక్" నుంచి తేరుకోలేదు.

("యువ" సెప్టెంబరు '69)